క్లుప్తంగా

22న అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ బస్సు

ఆత్మకూరురూరల్: ఈ నెల 22న పౌర్ణమి సందర్భంగా ఉదయం 7 గంటలకు ఆత్మకూరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు డిపో మేనేజరు కరీమున్నీసా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానుపోను టికెట్ ధర రూ.1400 నిర్ణయించామన్నారు. బస్సులో వెళ్లే ప్రయాణికులు కాణిపాకం, సిరిపురం, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరి ప్రదక్షణ దర్శించుకోవచ్చన్నారు. వివరాలకు డిపో మేనేజరు (9959225645), ఆర్టీసీ సీఐ (9966009395), బస్సు కండక్టర్ సుబ్బయ్య (8555929504)లను సంప్రదించవచ్చు, లేదా ఆన్‌లైన్‌లో కూడా టికెట్ రిజర్వేషన్ చేయించుకోవచ్చన్నారు.

రేపు రక్తదాన శిబిరం

సంగం: మండలంలోని సిద్ధీపురంలో ఈ నెల 19న మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యువ నేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు ఎవరైనా రక్తదానం చేయవచ్చునని, ప్రతి ఒక్కరూ ఈ రక్తదానంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

870 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో శుక్రవారం 870 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 941 బేళ్లు రాగా 870 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 1,12,825 కిలోల పొగాకును విక్రయించగా రూ.3,11,83,027 వ్యాపారం జరిగింది. కిలో ధర గరిష్టంగా రూ.305, కనిష్టంగా రూ.205 పలికింది. సగటు ధర 276.38 నమోదైంది. వేలంలో 21 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కుంటుపడిన సచివాలయ సేవలు

కావలి: దగదర్తి మండలం ఉలవపాళ్ల సచివాలయంలో వారం రోజులుగా సేవలు కుంటుపడ్డాయి. సచివాలయంలోని కంప్యూటర్లు మరమ్మతులకు గురి కావడంతో సేవలు నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూసర్వే సంబంధించిన చలాన్లు, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయానికి వెళితే కంప్యూటర్లు మరమ్మతులకు గురయ్యాయని చెబుతూ వెనక్కి పంపించేస్తున్నారు. దీంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా ఇదే తంతు కొనసాగుతుండటంతో దరఖాస్తుదారులు మీసేవ కేంద్రాలు చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సచివాలయ సేవలు వెంటనే అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెలగపాడులో ఆరోగ్యసురక్ష

కలిగిరి: మండలంలోని వెలగపాడు గ్రామ సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కలిగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కే మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు జరిపి మందులను అందజేశారు. ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

రోగులకు వైద్య సేవలు

చేజర్ల: మండలంలోని తూర్పుపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రోగులకు 104 వాహనం ద్వారా వైద్య సేవలు అందించారు. సీహెచ్‌ఓ చంద్రయ్య సుమారు 50 మంది రోగులను పరీక్షించారు. ఎక్కువగా జలుబు, దగ్గు, నెమ్ము, కీళ్ల నొప్పుల రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎం అనిత, ఆశ వర్కర్ సులోచన పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లెలో బుధవారం నుంచి జరుగుతున్న సీతారాముల ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. మూడో రోజు శుక్రవారం అర్చకులు ఉత్సవ, మూలవిరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, పార్వేట కార్యక్రమం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

సంగం: మండలంలోని సిద్ధీపురం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న షేక్ జిలానీ కుటుంబానికి యువనేస్తం ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. యువనేస్తం ఫౌండేషన్ సభ్యులు నాయబ్‌రసూల్, పరంధామయ్య, అన్వేష్‌రెడ్డి, రామిరెడ్డి, ధనుంజయ్ మిత్ర బృందం గ్రామస్తుల సహకారంతో తిరుపతిలోని రుయా వైద్యశాలలో చికిత్స పొందుతున్న జిలానీ కుటుంబానికి రూ.75 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

అనుకున్నదొక్కటి.. అయిందొక్కటి..

నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ లెక్కలు మారాయి. అధికార పార్టీ అభ్యర్థికి బలమైన పోటీ ఇవ్వగలనే ధీమాతో ఉన్న కాకర్ల ఆఖరికి అంచనాలకు దూరంగా ఆగిపోయినట్లు పోలింగ్ బూత్‌ల వారీగా వేసుకున్న లెక్కల్లో తేలిపోయింది. పోలింగ్ జరిగిన తీరుపై మండలాలు, గ్రామాల వారీగా లెక్కలు తెప్పించుకున్నారు. పోలింగ్ ముగిసిన మరుసటి రోజు నుంచి కాకర్ల పోలింగ్ జరిగిన తీరుపై ముఖ్య అనుచరులతో చర్చించారు. అయితే తాము ఊహించిందొకటి, క్షేత్రస్థాయిలో జరిగింది మరొకలా జరిగిందే అనే అసంతృప్తితో రుసరుసలాడుతున్నట్లు సమాచారం.

- కాకర్ల ఓట్ల లెక్కలు మారాయి
- పెరిగిన పోలింగ్ శాతంపై సమాలోచనలు
- కండువాలు కప్పించుకున్న వారి ఓట్లపై ఆరా
- క్షేత్రస్థాయి నివేదికలతో తలపట్టుకుంటున్న వైనం
- సొంత పార్టీ వారే మోసం చేశారంటూ అసహనం



ఉదయగిరి: ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు ఎన్నికలకు ముందే తన భవిష్యత్ ఏమిటో తెలిసినా.. రూ.కోట్లతో ఓట్లు రాలుతాయని ఎక్కడో చిన్న ఆశతో పోరాడాడు. తొలి ప్రయత్నంలో గెలవలేకపోయినా.. బలమైన ప్రత్యర్థిగా పోటీ ఇచ్చి పార్టీలో తన స్థానాన్ని పదిల పరుచుకోవాలని ఆశ పడ్డాడు. ప్రతి ఓటుకు రేటు కట్టి రూ.కోట్లు పంపకాలు చేసినా.. ఆ మేరకు సైకిల్‌కు ఓట్లు పడలేదన్న క్షేత్రస్థాయి రిపోర్టులతో కాకర్లతో పార్టీ నేతలపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్‌కు ముందు వరకు విజయం సాధిస్తాననే ధీమాతో ఉన్న కాకర్ల క్షేత్రస్థాయి లెక్కలు చూసుకున్న తర్వాత డీలా పడ్డారు. నియోజకవర్గంలో రూ.70 కోట్లు పైగా ఖర్చు చేసినా తమ పార్టీ నేతలు పనిచేయలేదని అనుచరుల వద్ద వాపోయినట్లు సమాచారం. సొంత పార్టీ వారే క్షేత్రస్థాయిలో పనిచేయకుండా వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ముంచిన బొల్లినేని వర్గీయులు

ఉదయగిరి టీడీపీ సీటు కాకర్ల సురేష్‌కు రావడాన్ని జీర్ణించుకోలేకపోయిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు తెరచాటు ప్రయత్నాలు చేసి సఫలీకృతమైనట్లుగా ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. టీడీపీకి మెజారిటీ వచ్చే కొండాపురం మండలంలో బొల్లినేని వర్గీయులు పోలింగ్ రోజు చేతులెత్తేసినట్లు సురేష్ క్షేత్రస్థాయి పర్యటనలో గ్రహించారు. తమ వద్ద కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేశారని బొల్లినేని వర్గీయులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ రోజు బొల్లినేని నియోజకవర్గంలోనే మకాం వేసి తన ముఖ్య అనుచరులతో టచ్‌లో ఉంటూ సురేష్‌కు ఓట్లు పడకుండా తగు సూచనలు, సలహాలు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. కొండాపురంలో మెజారిటీపై టీడీపీ పెట్టుకున్న ఆశలు గల్లంతైనట్లు సమాచారం.

పెరిగిన పోలింగ్ శాతం ఎవరికి ప్రయోజనం?

ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,41,677 మంది ఓటర్లుండగా ప్రస్తుత ఎన్నికల్లో 81.72 శాతం పోలింగ్ జరిగింది. 2019 ఎన్నికల్లో 75.8 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. ఈ పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి ప్రయోజనం అనే దానిపై కూడా అభ్యర్థి మల్లగుల్లాలు పడుతున్నారు. వలస ఓటర్లు తమ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా నమోదైతే తనకు ప్రయోజనమని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళా ఓటర్ల పోలింగ్ శాతం పెరిగితే తాను ఓటమి పాలు కావడం ఖాయమని టీడీపీ అభ్యర్థి మల్లగుల్లాలు పడుతున్నారు. మహిళా ఓటర్ల మనోగతం, పోలింగ్ సరళి, మహిళలు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్న తీరు, పోలింగ్‌లో పాల్గొన్న వారి అభిప్రాయాలు బేరీజు వేస్తూ టీడీపీ అభ్యర్థి లెక్కల్లో మునిగి తేలుతున్నారు. పోలైన మొత్తం 1,97,970 ఓట్లలో మహిళా ఓటర్లు 98,554 మంది ఉన్నారు. వీరి ఓట్లు అత్యధికంగా వైఎస్సార్‌సీపీకి పడినట్లు క్షేత్రస్థాయి నివేదికల ద్వారా తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి డీలాపడినట్లు తెలుస్తోంది. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారని పెరిగిన పోలింగ్ శాతం తేటతెల్లం చేస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్న నేపథ్యంలో అభ్యర్థి కలవర పడుతున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో మహిళలు, రైతులు, రైతు కూలీలు, వృద్ధులు ఉదయం నుంచే బారులు తీరి ఓటింగ్‌లో పాల్గొనడం, ఆ వర్గాల వారు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటేయడం టీడీపీ అభ్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓటర్లకు డబ్బు పంపిణీ చేసినప్పటికీ తమకు అనుకూలంగా ఓటింగ్ జరగలేదనే చర్చ కూడా ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

మండలాల వారీగా పోలైన ఓట్ల వివరాలు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలైన శాతం
దుత్తలూరు	22,591	18,152	80.35
జలదంకి	37,814	32,503	85.95
కలిగిరి	37,963	31,637	83.34
కొండాపురం	34,591	28,455	82.26
సీతారామపురం	19,160	14,715	74.80
ఉదయగిరి	30,264	24,238	80.09
వింజమూరు	33,369	26,093	78.20
వరికుంటపాడు	25,925	22,177	85.54

కండువాలు కప్పించుకున్న వారిపై అసంతృప్తి

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు సామాజిక వర్గాలకు చెందిన నేతలు, కార్యకర్తలకు డబ్బులు ఎరగా చూపి పెద్ద ఎత్తున చేరికలను ప్రోత్సహించారు. అయితే వీరంతా సీరియస్‌గా పనిచేయలేదని, కేవలం తన వద్ద డబ్బులు మాత్రమే కొట్టేశారన్న అసంతృప్తి టీడీపీ అభ్యర్థిలో వ్యక్తమవుతోంది. ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, మరికొంత మంది ముఖ్యమైన నేతలు టీడీపీ అభ్యర్థి నుంచి భారీ మొత్తంలో డబ్బు తీసుకున్నప్పటికీ పార్టీ విజయం కోసం కృషి చేయలేదని అభ్యర్థి తన అనుచరుల వద్ద వాపోయినట్లు తెలుస్తోంది. మొత్తం మీద మండలాల వారీగా పోలింగ్ సరళిని పరిశీలించినప్పుడు సీతారామపురం, ఉదయగిరి, వింజమూరు, కలిగిరి, జలదంకి మండలాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరిగిందని టీడీపీ అభ్యర్థి భావిస్తున్నారు.

రక్తపోటు దినోత్సవ ర్యాలీ

చేజర్ల: ప్రపంచ రక్త పోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని చిత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి మాట్లాడుతూ అధిక రక్తపోటును ఎలా నియంత్రించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలు వివరించారు. చేజర్ల పీహెచ్‌సీలో రోగులకు బీపీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మెహతాబ్, సీహెచ్‌ఓ మంజుల, సూపర్‌వైజర్ జే లక్ష్మమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ సుజాత, సిబ్బంది హెప్సీబా, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



చిత్తలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రపంచ రక్తపోటు దినోత్సవం

సోమశిల: అనంతసాగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తరచూ రక్తపోటును పరీక్షించుకోవాలని, రక్తపోటు ఉన్న వారు విధిగా క్రమం తప్పకుండా మందులు వాడుకోవాలని, ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనల మేరకు జీవన శైలిలో మార్పులు చేసుకుంటూ ఆరోగ్య ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకుంటూ శారీరక వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటును నియంత్రించుకోవడం అలవాటు చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, హెల్త్ అసిస్టెంట్లు అబ్దుల్‌ఖాదర్, అహ్మద్‌బాషా, టీవీఆర్‌వీ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ మీరామొహిద్దీన్, ఏఎన్‌ఎం ఖాజమ్మ, స్టాఫ్ నర్స్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వాలని బీఎల్వోల నిరసన


వరికుంటపాడు: మండలంలో ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేసిన ఏర్పాట్లుకు బిల్లులు ఇవ్వాలని కోరుతూ పలువురు బీఎల్వోలు శుక్రవారం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తాము పోలింగ్ బూత్‌ల వద్ద అవసరమైన ఏర్పాట్లను చేశామన్నారు. అందుకు సుమారు రూ.13 వేల వరకు ఖర్చు చేశామన్నారు. తమకు రావాల్సిన నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీఓ తోట వెంకటకృష్ణకుమారిని వివరణ కోరగా పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు ఏర్పాటు చేసిన బీఎల్వోలకు ఇవ్వాల్సిన నగదు చెల్లించి అక్విటెన్స్ తీసుకున్నామన్నారు. బీఎల్వోలకు రావాల్సిన రెమ్యూనరేషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చెల్లిస్తారన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎల్వోలు

నాడు-నేడు పనుల పరిశీలన

వరికుంటపాడు: మండలంలోని మాసాయిపేట మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న రెండో దశ మనబడి నాడు-నేడు పనులను శుక్రవారం ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో హెచ్‌ఎం జి.అనురాధను అభినందించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణ విషయంలో నెలకొన్న వివాదాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చూస్తామన్నారు. వేసవి దృష్ట్యా ప్లాస్టరింగ్ పనులకు ఎక్కువగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



టైల్స్ పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

- టీడీపీ నాయకుల వెంచర్‌కు
- స్పందించని ఇరిగేషన్ అధికారులు

ఆత్మకూరు: ఎన్నికల వేళ అధికార యంత్రాంగం ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదనుగా టీడీపీ నేతలు గ్రావెల్ దందాకు తెగబడ్డారు. ఏఎస్‌పేట మండలం హసనాపురం చెరువులో టీడీపీ నేతలు వారం రోజులుగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. చెరువు ధ్వంసం చేయడంపై రైతులతో పాటు స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ గ్రావెల్ రవాణాను గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ టీడీపీ నేతలు ఖాతరు చేయడం లేదు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండడంతో టీడీపీ నేతలు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి హయాంలో ఏఎస్‌పేట మండలం హసనాపురం చెరువును 'గ్రామకొలను పథకం' కింద అభివృద్ధి పరిచారు. కురిసే కొద్దిపాటి వర్షమైనా చెరువులోకి చేరేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఇటీవల శ్రీకొలను గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీకొలను వద్ద ప్రైవేట్ వెంచర్ వేశారు. ఆ ప్లాట్లను ఎత్తు చేసేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా హసనాపురం గ్రామ చెరువులోని గ్రావెల్‌ను గత వారం రోజుల క్రితం తరలిస్తుంటే పలువురు అభ్యంతరం చెప్పడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో తరలింపును నిలిపివేశారు. తాజాగా శుక్రవారం మరోసారి రెండు జేసీబీలు, పది ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈ పెంచలరావు కోసం ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. ఇప్పటికైనా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించి గ్రావెల్ తవ్వకాలను నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆత్మకూరు: హసనాపురం చెరువులో యథేచ్ఛగా గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

చేజర్లలో మోస్తరు వర్షం

చేజర్ల: గత నెల రోజులుగా వేసవి ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు శుక్రవారం మోస్తరు వర్షం కురిసే సరికి సేద దీరారు. మండలంలోని చేజర్ల, మడపల్లి, గొల్లపల్లి, ఆదూరుపల్లి, వావిలేరు తదితర గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందారు. చిన్నపాటి గుంతల్లోకి వర్షపు నీరు చేరాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడంతో వేసవిలో వసంత కాలాన్ని తలపించింది.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధన



కలశంతో అభిషేక జలాలు తెస్తున్న ఆలయ ధర్మకర్తలు, భక్తులు

కొండాపురం: శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన వేడుకలు మండలంలోని కొమ్మిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కంచర్ల సత్యనారాయణాచారి, కంచర్ల మాధవాచారి, కంచర్ల శేషాచారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గ్రామం నడిబొడ్డున ఉన్న గిలక బావి వద్ద నుంచి కలశంతో జలాలు తెచ్చి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పూలు, కూరగాయలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు

కలిగిరి: కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెం తిప్ప వద్ద ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, కృష్ణారెడ్డిపాళెంలోని బ్రహ్మంగారి ఆలయాల్లో శుక్రవారం ఆరాధన మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేకంగా ఆలంకరించారు. అర్చకులు అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

భక్తి ప్రపత్తులతో ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

సీతారామపురం: మండలంలోని గుండుపల్లిలో కొలువుదీరిన సీతాసమేత ప్రసన్న కోదండరామ స్వామి ఆలయంలో మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఉదయం గణపతిపూజ, స్వామి వారికి అభిషేకాలతో పాటు ప్రత్యే క హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని కోదండరామస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం ఏర్పాటు చేసింది. శనివారం సీతారాముల కల్యాణోత్సవం, రాత్రికి భజన కార్యక్రమంతో పాటు గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది.

రోలర్ స్కేటింగ్‌లో చిన్నారి రాణింపు

- జాతీయ స్థాయిలో అండర్ 5-7లో ద్వితీయ స్థానం

ఆత్మకూరు: గత రెండు రోజులుగా గోవా రాష్ట్రంలోని పనాజీలో జరుగుతున్న రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్- 5- 7 కేటగిరీలో ఆత్మకూరుకు చెందిన రాంపల్లి ప్రసాద్‌రెడ్డి మనుమరాలు పల్లె ధృతి ద్వితీయ స్థానం సాధించింది. ధృతి చిన్నప్పటి నుంచి స్కేటింగ్‌లో ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఈ క్రమంలో తాలుకా, డివిజన్ స్థాయిలో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని పలు ర్యాంకులు (స్థానం) సాధించింది. ఈ నేపథ్యంలో గతేడాది నవంబరులో విశాఖపట్నంలో జరిగిన ఏపీ రోలర్ స్కేటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రస్తుతం గోవాలో వివిధ కేటగిరీల్లో మూడు రోజులుగా జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తుండడంతో గురువారం నిర్వహించిన రోలర్ స్కేటింగ్ అండర్ 5-7 కేటగిరీలో పాల్గొన్న ధృతి జాతీయ స్థాయిలో రెండో స్థానం పొంది సిల్వర్ మెడల్ సాధించింది.



రోలర్ స్కేటింగ్‌లో ద్వితీయ స్థానం సాధించిన ధృతిని అభినందిస్తున్న కోచ్

వైభవంగా సీతారాముల ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లెలో కొలువైన సీతాలక్ష్మణ హనుమత్ సమే రామచంద్ర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు లోకా వెంకటప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకాలు, విశేష అలంకరణ, పుట్టమన్ను తెచ్చుట, అంకురారోపణం, నవగ్రహ మండపారాధనం, శాంతిహోమం, మంగళహారతి, గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం స్వామివార్ల కల్యాణ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మూగబోయిన సోషల్ మీడియా

సీతారామపురం: ఎన్నికల వేళ సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ నెల 13వ తేదీన ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెజేస్‌లు అభ్యర్థుల బ్రాడ్ కాస్టింగ్ కాల్స్, ఇన్‌స్టా రీల్స్, ఎక్స్ పోస్టర్లతో దద్దరిల్లిన సోషల్ మీడియా ప్రచారం గప్‌చుప్ అయిపోయింది. ఉదయగిరి నియోజకవర్గంలో పోటీ చేసిన ప్రధాన పార్టీలు తమ ప్రచారాలతో పాటు సోషల్ మీడియాను తయారు చేశారు. పార్టీ కేడర్‌తో పాటు మరికొందరు సొంత యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్ వేదికగా తాము అభిమానించే పార్టీలకు ప్రచారం చేశారు. గతంలో ఎన్నికల ప్రచారం ఓటర్లను ఆకర్షించడం కోసం వీధుల్లో గోడలపై రాతలు, పోస్టర్లు అతికించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేందుకు రూపాంతరం చెందింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో జిల్లా అంతగా జోరుగా ప్రచారం సాగింది.

సోషల్ మీడియా కీలకపాత్ర

ఎన్నికల ప్రచారంలో ఈ సారి సోషల్ మీడియా ప్రచారం కీలక పాత్ర పోషించింది. ఒకానొక సమయంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను సైతం తలదన్నేలా డిజిటల్ ప్రచారం కొనసాగింది. ఒక్క పోస్టు, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్, ఎక్స్, తదితర ఇంటర్నెట్ మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగింది. వివిధ పార్టీలు ఆయా అభ్యర్థులు ప్రైవేట్ పాటల ఆల్బమ్‌లు రూపొందించి వాటిని సోషల్ మీడియాను ప్రసార సాధనాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఈ ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకంగా టెక్నికల్ టీములను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొందరు అవాస్తవాలు, విష ప్రచారాలకు తెర లేపారు. వ్యూస్ కోసం, వైరల్ కావడం కోసం అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన ఘటనలు లేకపోలేదు. ఏది ఏమైనా పోలింగ్ ముగియడంతో సోషల్ మీడియాలో పోస్టులు తగ్గిపోయాయి.

రీసర్వే తప్పులు.. రైతులకు తిప్పలు

కావలి: దగదర్తి మండలంలో భూముల రీసర్వే సందర్భంగా అధికారులు చేసిన తప్పులు రైతులకు శాపంగా మారాయి. సర్వేను త్వరితగతిన ముగించాలనే ఉద్దేశంలో రైతులకు సమాచారం ఇవ్వకుండా, హడావుడిగా సర్వే చేపట్టడంతో రీసర్వే ప్రక్రియ అంతా తప్పుల తడకగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొట్టమొదటి సారిగా చేపట్టిన రీసర్వే ప్రక్రియపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం, కనీసం గ్రామ సభలు కూడా నిర్వహించకుండా రీసర్వే పూర్తి చేయడంతో భూముల వివరాలన్నీ తప్పుగా నమోదై రైతులు అల్లాడిపోతున్నారు. మండలంలో రీసర్వే పూర్తయిన అన్నీ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. భూములకు సంబంధించిన హద్దులు, యాజమాన్య హక్కులు, విస్తీర్ణం, భూస్వరూపం, తదితర వివరాలన్నీ తప్పుల తడకలుగా ఉన్నాయి. దీంతో సవరణ కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికల కారణంగా బిజీగా ఉన్నామంటూ అధికారులు దాట వేస్తుండడంతో నెల రోజుల నుంచి రైతులు పడిగాపులు పడుతున్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సవరణల కోసం సచివాలయాలకు వెళితే 'ఆన్‌లైన్ పోర్టల్' ఓపెన్ కావడం లేదంటూ వెనక్కి పంపుతున్నారు. దీంతో క్రయవిక్రయాలు కూడా భారీగా నిలిచిపోయాయి. రిజిస్ట్రేషన్లు జరిగిన పట్టా భూములను కూడా ప్రభుత్వ భూములుగా తప్పుగా రీసర్వేలో నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూములు రిజిస్ట్రేషన్ కావడం లేదు. బ్యాంకుల్లో రుణాలకు కూడా అడ్డంకిగా మారింది. వారసత్వంగా సంక్రమించిన భూములను కొనుగోలుగా నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ సమయంలో లింక్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిగా అన్నీ డాక్యుమెంట్లు చూపుతున్నా అడంగల్‌లో భూసంక్రమణ కాలమ్‌లో 'కొనుగోలు'గా నమోదవడంతో లింక్ డాక్యుమెంట్లు లేనిదే రిజిస్ట్రేషన్ చేయలేమని స్పష్టం చేస్తుండడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. తప్పుల సవరణకు సంబంధించిన ఆన్‌లైన్ పోర్టల్ కూడా పనిచేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఫిర్యాదులు అందుతున్నాయి

దగదర్తి మండలంలో రీసర్వే ప్రక్రియలో తప్పులపై రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఎన్నికల హడావుడి కారణంగా సిబ్బంది బిజీగా ఉండడంతో రైతులు ఇబ్బంది పడిన విషయం వాస్తవమే. సమస్య పరిష్కారానికి వారం రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

– వీకే శీనానాయక్, కావలి ఆర్డీఓ